సాక్షి నిజామాబాద్

గురువారం । 17 । అక్టోబర్ । 2024



బకాయిలు విడుదల చేయాలి

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు నిరసన చేపట్టాయి.

- 9లో ▸



డబ్బులు స్వాహా

మెండోరాలో మహిళా సంఘాల పొదుపు, రుణాల ఈఎంఐ డబ్బులు రూ.26 లక్షలను వీఎల్ఈ స్వాహా చేసింది.

- 8లో ▸


గరిష్ఠం/కనిష్ఠం
38.3 /22.4

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. మంచు కురుస్తుంది.

నామినేటెడ్ ఆశలు

- సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన నేపథ్యంలో ఆశావహుల్లో ఉత్కంఠ
- రాష్ట్ర కార్పొరేషన్ పదవుల రేసులో జిల్లా సీనియర్ నాయకులు
- ఇప్పటికే జిల్లా నుంచి నలుగురికి దక్కిన రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ పదవులు



కార్పొరేషన్ల నామినేటెడ్ పదవుల పందేరం కొనసాగుతుండగా జిల్లాకు చెందిన ఆశావహులు ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. ఇప్పటికే ముఖ్యమైన గ్రంథాలయం, నుడా చైర్మన్, మార్కెట్ కమిటీల పదవుల పంపకాలు పూర్తయ్యాయి. ఇంకా పలువురు సీనియర్ నాయకులు రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవుల రేసులో ఉన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన నేపథ్యంలో ఆశావహుల్లో ఆసక్తి, ఉత్కంఠ నెలకొంది.

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి కావస్తోంది. ఇప్పటివరకు నామినేటెడ్ పదవుల పంపకాలు పూర్తి కాలేదు. ప్రస్తుతం పందేరం కొనసాగుతుండగా జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ల నామినేటెడ్ పదవులతో పాటు, జిల్లాలోని నామినేటెడ్ పదవుల కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాలో ముఖ్యమైన గ్రంథాలయం, నుడా చైర్మన్, మార్కెట్ కమిటీల పదవుల పంపకాలు పూర్తయ్యాయి. నుడా చైర్మన్‌గా కేశ వేణు, గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముప్ప గంగారెడ్డి ఎంపికయ్యారు. ఇక జిల్లా నుంచి నలుగురికి రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ల పదవులు దక్కాయి. కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా మానాల మోహన్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా తాహెర్‌బిన్ హందాన్, సీడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా అన్వేష్‌రెడ్డి, మినరల్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఈరవత్రి అనిల్ నియమితులయ్యారు. ఇంకా జిల్లా నుంచి నామినేటెడ్ పదవుల రేసులో పలువురు సీనియర్ నాయకులు ఉన్నారు. మరోవైపు జిల్లాకు చెందిన బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ పీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మరోవిడతలో కేటాయించనున్న నామినేటెడ్ పదవుల విషయమై శ్రేణుల్లో ఉత్కంఠ, ఆసక్తి నెలకొంది.

సిద్ధమైన జాబితా

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన నేపథ్యంలో నామినేటెడ్ పదవుల ఆశావహుల్లో ఆసక్తి, ఉత్కంఠ నెలకొంది. మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల సందర్భంగా పార్టీ అధినాయకత్వంతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల విషయమై చర్చ జరుపనున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీలో చర్చల్లో భాగంగా రెండో విడత రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవుల విషయంలో నిర్ణయం ఉండనున్నట్లు తెలుస్తోంది. ఇంకా 26 రాష్ట్ర స్థాయి కార్పొరేషన్లకు చైర్మన్లకు కేటా యించాల్సి ఉంది. హర్యానా, జమ్ముకశ్మీర్ ఎన్నిక లు జరగ్గా.. ఈ పదవుల పంపకాలు ఆలస్యమైనట్లు గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర కార్పొరేషన్ పదవులకు సంబంధించి ఇప్పటికే జాబితా సిద్ధమైందని, అధిష్టానానికి వివరించిన తర్వాత రెండు మూడు రోజుల్లో జాబితాను విడుదల చేయనున్నట్లు సమాచారం. దీంతో జిల్లా నుంచి నామినేటెడ్ ఆశావహ నాయకుల్లో ఉత్కంఠ, శ్రేణుల్లో ఆసక్తి నెలకొంది.

ఆశావహులు వీరే !

జిల్లాకు చెందిన పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్, పీసీసీ ప్రధాన కార్యదర్శులు కాటిపల్లి నగేశ్‌రెడ్డి, గడుగు గంగాధర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సయ్యద్ ఖైసర్, రాజనరేందర్ గౌడ్, బాస వేణుగోపాల్ యాదవ్, కాలూరి భోజన్న, గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, దయాకర్ గౌడ్, రాంభూపాల్, ఏబీ శ్రీనివాస్, రాము, నరాల రత్నాకర్, రామర్తి గోపి, ఉష, మార చంద్రమోహన్ రెడ్డి తదితరులు నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నవారిలో ఉన్నారు. వీరిలో బాడ్సి శేఖర్‌గౌడ్, గడుగు గంగాధర్‌లు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవుల విషయంలో ముందంజలో ఉన్నారు.

న్యూస్‌రీల్

గంజ్‌లో పరిశుభ్రత పాటించాలి



సుభాష్‌నగర్‌: నగరంలోని గాంధీ గంజ్‌లో పరిశుభ్రత పాటించాలని, మార్కెట్ కమిటీ ఆదాయం పెంపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి సూచించారు. బుధవారం నగరంలోని గాంధీగంజ్‌ను ఆయన తనిఖీ చేశారు. గంజ్ అపరిశుభ్రంగా ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. రిటైల్ కూరగాయల వ్యాపారులతోపాటు గంజ్‌లో ఉన్న స్వెట్టర్ షాపులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్కెట్ కమిటీ అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కూరగాయల దుకాణాదారులు, ఇతర వ్యాపారులకు ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. మార్కెట్ కమిటీ అధికారులు, డైరెక్టర్ మల్లేష్, సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్‌: అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకానికి ఈనెల 29 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిణి నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే ఎస్సీ విద్యార్థులకు ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌ను విధుల నుంచి తొలగించాలి



నిజామాబాద్ అర్బన్‌: మాక్లూర్ కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌ను విధుల నుంచి తొలగించాలని ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు వినతి పత్రం అందజేశారు. సంఘం నాయకుడు సుధాకర్ మాట్లాడుతూ.. కేజీబీవీ ప్రత్యేకాధికారి అనురాధ సిబ్బందిని వేధిస్తున్నారని ఆరోపించారు. అపరాధ రుసుముతో విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. లలిత, ముత్తెన్న, రాజేశ్వర్, మల్లేష్, కిషన్, సాయన్న ఉన్నారు.

కొత్త ఏవోలు వచ్చారు

- జిల్లాకు ఎనిమిది మందిని కేటాయించిన ప్రభుత్వం

కొత్తగా వచ్చిన ఏవోలకు కేటాయించిన మండలాలు

పేరు	మండలం
కె శ్వేత	సాలూరా
బి నిషిత	పోతంగల్
ఎం రాజశేఖర్	వర్ని
జి సాయికృష్ణ	రుద్రూర్
టి రాజు	కోటగిరి
ఎస్ వైష్ణవ్	ఏర్గట్ల
వై యశ్వంత్	మెండోరా
బి మధుసూదన్	డొంకేశ్వర్

డొంకేశ్వర్(ఆర్మూర్‌): వ్యవసాయ శాఖకు సిబ్బంది బలం పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు కొత్తగా ఎనిమిది మంది మండల వ్యవసాయాధికారులను (ఏవోలను) నియమించింది. ఇటీవల నిర్వహించిన టీఎస్‌పీఎస్సీ పరీక్షల్లో ఎంపికైన వారికి పోస్టింగ్‌లు ఇచ్చారు. పోస్టింగ్ ఆర్డర్‌లు తీసుకున్న అభ్యర్థులు బుధవారం వ్యవసాయ శాఖకు రిపోర్టు చేశారు. అయితే సిబ్బంది కొరత కారణంగా ప్రస్తుతం పని చేస్తున్న ఏవోలు కొన్ని చోట్ల ఒక్కరే రెండు మండలాలను చూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొత్త మండలాలు అదనపు భారంగా మారాయి. దీంతో పని ఒత్తిడి కూడా పెరిగింది. ప్రస్తుతం కొత్త వారు రావడంతో ఉన్నవారికి కాస్త ఉపశమనం లభించింది. వ్యవసాయ శాఖకు కూడా పరిపాలన సులభతరం కానుంది. కొత్త మండల వ్యవసాయాధికారులు ఒకటి రెండు రోజుల్లో విధుల్లో చేరనున్నారు.

బంగారం మరింత ప్రియం!

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: బంగారం ధర మరింత పెరిగింది. బుధవారం 24 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు 78,900లు పలికింది. ప్రస్తుతం శుభ ముహూర్తాల సమయం కావడంతో చాలా మంది బంగారం కొనడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ సమయంలో ధరలు రోజుకో రికార్డు సృష్టిస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు.

మాదిగలను మోసం చేసిన సీఎం



ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

- వర్గీకరణ కోసం మళ్లీ ఉద్యమాలు చేస్తాం
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

నిజామాబాద్ అర్బన్‌: ఎస్సీ వర్గీకరణ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలను మోసం చేశారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. బుధవారం నగరంలోని శ్రావ్య గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు నిర్వహించారు. మందకృష్ణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాలల ఒత్తిడికి తలొగ్గి వర్గీకరణను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో మాట్లాడుతూ ఆర్డినెన్స్ తీసుకొచ్చి మాదిగలకు న్యాయం చేస్తామని, వర్గీకరణ అమలు చేసిన మొదటి రాష్ట్రంగా నిలుస్తామని చెప్పి ఇప్పుడు మోసం చేశారన్నారు. టీఎస్సీ నియామకాల్లో వర్గీకరణ లేకుండానే 11 వేల పోస్టులను భర్తీ చేశారన్నారు. దీంతో మాదిగ అభ్యర్థులు ఎంతో నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నమ్మక ద్రోహానికి గురైన మాదిగలు ఎంతటి పోరాటాలకైన వెనుకాడరన్నారు. మాదిగలను మోసం చేసిన వారు మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. వర్గీకరణ అమలు కోసం మళ్లీ ఉద్యమాలు చేస్తామని తెలి పారు. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ రూపొందించి, రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి నిద్రలేకుండా చేస్తామన్నారు. వర్గీకరణ కోసం జరిగిన అన్ని పోరాటాల్లో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారని, ఇప్పుడు మాత్రం వర్గీకరణ అమలు చేయడం లేదన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సైతం అమలు చేయడం లేదని విమర్శించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ 30 ఏళ్లగా మాదిగ జాతి కోసం పోరాటం చేసిన చరిత్ర మందకృష్ణకు దక్కుతుందన్నారు. వర్గీకరణ కోసం ఈ సమయంలో ఆయనకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్, జిల్లా అధ్యక్షుడు సరికెల పోశెట్టి, ప్రమోద్, వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ, నాయకులు మైలారం బాలు, గంగారం, సురేష్ , గంగాధర్, మారుతి, గద్దల రమేష్ పాల్గొన్నారు.



మహనీయుల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మందకృష్ణ మాదిగ, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

19న ‘స్విమ్మింగ్’ ఎంపికలు

నిజామాబాద్ నాగారం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి స్విమ్మింగ్ ఎంపికలు ఈ నెల 19న నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14, 17 విభాగాల్లో బాల బాలికలకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. నగరంలోని సుభాష్‌నగర్‌లో గల ప్రభుత్వ స్విమ్మింగ్ పూల్‌లో ఉదయం 10 గంటలకు ఎంపిక పోటీలు ప్రారంభం అవుతాయని ఆసక్తి ఉన్న వారు బోనాఫైడ్ తీసుకొని రావాలని సూచించారు. అలాగే అండర్–14 షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఈ నెల 19న ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

యాసంగి ప్రణాళిక ఖరారు

- ప్రతిపాదనలు రూపొందించిన వ్యవసాయ శాఖ
- 5,18,303 ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా



యాసంగిలో సాగయ్యే ప్రధాన పంటల అంచనా(ఎకరాల్లో)

పంట	గతేడాది సాగు	ప్రస్తుతం అంచనా
వరి	4,15,861	4,19,768
మొక్కజొన్న	21,459	22,936
శనగ	16,769	16,076
మినుములు	1,220	619
సజ్జలు	8,573	10,302
నువ్వులు	6,451	8,240
పొద్దు తిరుగుడు	3,087	2,790

ఎరువుల అంచనా (మెట్రిక్ టన్నుల్లో)

ఎరువులు	గతేడాది	ప్రస్తుతం
యూరియా	74,978	75,000
డీఏపీ	12,024	18,951
ఎంవోపీ	1,850	12,618
కాంప్లెక్స్	41,856	46,367

డొంకేశ్వర్(ఆర్మూర్‌): యాసంగి పంటల సాగు ప్రణళిక ఖరారైంది. ఈ సీజన్‌లో 5,18,303 ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ ప్రతిపాదనలు రూపొందించింది. పంటలతో పాటు అందుకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులతో కలిపి పూర్తి యాక్షన్ ప్లాన్ రెడీ చేసింది. అత్యధికంగా వరి 4,17,768 ఎకరాల్లో రైతులు సాగు చేసే అవకాశం ఉన్నట్లు అంచనా వేసింది. అయితే గతేడాది యాసంగితో పోలిస్తే పంటల సాగు కొంత మేర పెరిగే అవకాశం ఉంది. వర్షాలు కురిసి జలాశయాలు నిండుగా ఉండడంతో అనుకున్నదాని కంటే ఎక్కువగా పంటలు సాగయ్యే అవకాశముంది. ఆరుతడి పంటలైన మొక్కజొన్న, జొన్నలు, నువ్వులు, సజ్జల సాగు కూడా పెరగనుంది. పంటల సాగు విస్తీర్ణం పెరగనున్నందునా ఎరువులను కూడా వ్యవసాయ శాఖ పెంచింది. ఎరువుల కోసం రాష్ట్ర శాఖకు ఇండెంట్‌ను పంపించారు. అలాగే వరి కోసం జిల్లాకు 1,04,942 క్వింటాళ్లు, మొక్కజొన్నకు 1,834 క్వింటాళ్లు, శనగ కోసం 4,019 క్వింటాళ్లు, మినుముల కోసం 50 క్వింటాళ్లు, సజ్జలకు 412 క్వింటాళ్లు, నవ్వులకు 164 క్వింటాళ్లు, పొద్దు తిరుగుడు కోసం 55 క్వింటాళ్ల విత్తనాలు అవసరం కానున్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. రైతులు యాసంగి పనులను డిసెంబర్‌లో ప్రారంభించనున్నారు.

అసంపూర్తిగా 21 ప్యాకేజీ పనులు

- మోర్తాడ్, కమ్మర్‌పల్లి, భీమ్‌గల్ మండలాల్లో నిలిచిన పైప్‌లైన్ పనులు
- ఆరేళ్లుగా వాయిదా పడుతున్న వైనం



కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్ కాడి చెరువు వద్ద 21 ప్యాకేజీ పనుల పైపులు

మోర్తాడ్‌: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో బాల్కొండ నియోజకవర్గంలోని పంట పొలాలకు సాగునీటిని అందించడానికి నిర్దేశించిన 21వ ప్యాకేజీ పైప్‌లైన్ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఆరేళ్లుగా డిస్ట్రిబ్యూటరీ పైప్‌లైన్ పనులు వాయిదా పడుతూనే వస్తున్నాయి. ప్రధాన పైప్‌లైన్ పనులు పూర్తి చేసినా ప్రతి ఎకరానికి సాగునీటిని అందించే డిస్ట్రిబ్యూటరీ పనులకే తీవ్ర ఆటంకం కలుగుతుంది. డిస్ట్రిబ్యూటరీ పైప్‌లైన్‌ను పంట పొలాల మధ్యలోనే వేయాల్సి ఉంది. రైతులు రెండు సీజన్లలో పంటలను సాగు చేస్తుండటంతో నీటిపారుదల శాఖ అధికారులు పైప్‌లైన్ పనులను పూర్తి చేయలేకపోతున్నారని తెలుస్తుంది. 21వ ప్యాకేజీ పైప్‌లైన్‌కు సంబంధించి సేకరించే భూమికి పరిహారం ఇచ్చే అవకాశం లేదు. తాము పైప్‌లైన్ వేసిన తరువాత దానిపై రైతులు యథావిధిగా పంటలను సాగు చేసుకోవచ్చని ఎలాంటి ఇబ్బంది ఉండదని నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు గతంలోనే స్పష్టం చేశారు.

భూసేకరణ జరిపితే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందనే ఉద్దేశంతో అండర్ గ్రౌండ్ పైప్‌లైన్ వేసేలా ప్రత్యేక డిజైన్ రూపొందించారు. మోర్తాడ్, కమ్మర్‌పల్లి, వేల్పూర్ మండలాల్లోని రైతులు ఇప్పటికే వరద కాలువ, రైల్వేలైన్‌ల కోసం ఎంతో విలువైన భూములను త్యాగం చేశా రు. తాజాగా జాతీయ రహదారి 63 విస్తరణ కోసం మరింత భూములను రైతులు కోల్పోనున్నారు. 21వ ప్యాకేజీ పైప్‌లైన్‌తో భూమికి నష్టం జరగకూడదనే పైప్‌లైన్‌ల కోసం డిజైన్ తయారు చేశారు.

బదిలీపై వెళ్లిన జేఈలు

ప్యాకేజీ 21 పనులు పూర్తి చేసే విషయంలో నీటి పారుదల శాఖ అధికారుల నియంత్రణ కరువైంది. గతంలో నియమించిన జేఈలు బదిలీపై వెళ్లగా కొత్తగా నియమితులైన జేఈలకు పనులపై అవగాహన కలిగే సరికి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంది. డివిజనల్ ఇంజినీర్లకు ప్యాకేజీ పనులతో సంబంధం లేదు. ఈఈ స్థాయి అధికారే అన్ని తానై పనులు అజమాయిషీ చేస్తున్నా అనారోగ్యం కారణంగా పనులపై నియంత్రణ కరువైందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఉన్నతాధికారులు స్పందించి పనులు పూర్తి చేయించి సాగునీటి వసతిని మెరుగుపరచాలని రైతులు కోరుతున్నారు.

70,784 ఎకరాలకు సాగునీరు

మోర్తాడ్, కమ్మర్‌పల్లి, వేల్పూర్, భీమ్‌గల్ మండలాల్లోని 70,784 ఎకరాల భూములకు సాగునీటిని అందించే లక్ష్యంగా ప్యాకేజీ 21 పనులను ఆరంభించారు. ఈ పథకం కోసం మొదట్లో రూ.750 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేయగా పంట భూములకు నష్టం జరుగకుండా పైప్‌లైన్ పనులను డిజైన్ చేయడంతో అంచనా వ్యయం కాస్తా రూ.2వేల కోట్లకు చేరింది. రైతులు రెండు సీజన్లలో పంటలను సాగు చేస్తుండటంతో పైప్‌లైన్ పనులు ముందుకు సాగడం లేదు. దీంతో డిస్ట్రిబ్యూటరీల కోసం తెచ్చిన పైపులు అక్కడ అలాగే ఉండిపోయాయి. కోనసముందర్, మోర్తాడ్, వడ్యాట్, తిమ్మాపూర్, వేల్పూర్ మండలంలోని వివిధ గ్రామాలలో పైప్‌లు వేసిన చోట అలాగే ఉండిపోయాయి.

టాస్క్‌ఫోర్స్ ప్రక్షాళన

- ఏసీపీకి సహకరించిన ఏఎస్సైపై విచారణ!
- ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

ఖలీల్‌వాడి: జిల్లాలో అక్రమ దందాలను అరికట్టడానికి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. అయితే టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అక్రమ దందాలను అరికట్టకుండా చేతివాటం ప్రదర్శించారు. మామూళ్లు తీసుకొని ఆయా దందాలు చేసే వారిని వదిలేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో సీపీ కల్మేశ్వర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులపై విచారణ జరిపించి కొరడా ఝళిపించారు. ఇందులో పని చేసే సిబ్బందిని బదిలీ చేయగా ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు. పోలీస్ శాఖలో వచ్చిన అవినీతి ఆరోపణలపై సీపీ ఎస్బీ, ఇంటెలిజెన్స్ అధికారులతో విచారణ చేయించి చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఫోన్లు చేసి..

అవినీతి ఆరోపణలు రావడంతో ఏసీపీని టాస్క్‌ఫోర్స్ నుంచి బదిలీ చేసి డీజీపీ ఆఫీస్‌కు అటాచ్ చేశారు. ఆ ఏసీపీకి సహకరించిన ఏఎస్సైపై విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. సదరు ఏఎస్సై గతంలో టాస్క్‌ఫోర్స్‌లో పని చేయడంతో ఏసీపీతో సత్సంబంధాలు నెరిపి రంగంలోకి దిగినట్లు సమాచారం. దీంతో పీడీఎస్ బియ్యం దందా, గంజాయి, అక్రమ మైనింగ్, మట్కా నిర్వాహకులకు ఫోన్లు చేసి వసూళ్లు చేసినట్లు తెలుస్తోంది. సదరు ఏఎస్సై సహకారంతో ఏసీపీ బాగానే సంపాదించినట్లు పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఏఎస్సైతోపాటు ఓ కానిస్టేబుల్ వ్యవహారాలను చక్కబెట్టినట్లు తెలుస్తోంది. టాస్క్‌ఫోర్స్‌లో ప్రక్షాళన జరగడంతో ఆ ఏసీపీకి కీలకంగా వ్యవహరించిన ఏఎస్సైపై విచారణ జరుగుతోన్నట్లు సమాచారం.

టాస్క్‌ఫోర్స్ ఖాళీ

టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తిని డీజీపీ ఆఫీస్‌కు ఆటాచ్ చేశారు. ఇందులో ఇద్దరు సీఐలు ఉండగా అంజయ్య సిక్ లీవ్‌పై వెళ్లగా మరో సీఐ పురుషోత్తం ఆర్మూర్ సీఐగా బదిలీ అయ్యారు. సోమవారం ముగ్గురు హెడ్‌కానిస్టేబుళ్లు, నలుగురు కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. మంగళవారం రాత్రి అవినీతి ఆరోపణలపై ఇద్దరు టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుళ్లు రాములు, సుధాకర్‌ను సస్పెండ్ చేశారు. దీంతో టాస్క్‌ఫోర్స్ ఆఫీస్‌లో సిబ్బంది లేకుండా అయ్యారు. సీసీఎస్ ఏసీపీ నాగేంద్ర చారికి టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్‌కు కొత్త టీమ్ వచ్చే అవకాశాలు ఉన్నాయి.

భారీగా బదిలీలు

జిల్లాలో పోలీసుల పని తీరును బట్టి బదిలీలు చేపడుతున్నట్లు చర్చ జరుగుతోంది. సోమవారం రాత్రి 70 మంది కానిస్టేబుళ్లు, 12 మంది హెడ్ కానిస్టేబుళ్లు, ఆరుగురు ఏఎస్సైల బదిలీ కాగా, మంగళవారం రాత్రి ఆరుగురు కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. సీపీ కెఆర్ నాగరాజు హయాంలో భారీ ఎత్తున బదిలీలు జరగ్గా మళ్లీ కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్లు, ఏఎస్సైలు పైరవీల ద్వారా తాము అనుకున్న చోటుకు వెళ్లారు. తాజాగా సీపీ కల్మేశ్వర్ పైరవీలకు తావులేకుండా బదిలీలు చేస్తున్నారు. ఆరోపణలు వచ్చిన సిబ్బందిపై విచారణ చేయించి, మరికొంత మందిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది.



ముగిసిన పోస్టింగ్‌ల కేటాయింపు

నిజామాబాద్ అర్బన్‌: జిల్లా విద్యాశాఖలో నూతన టీచర్లకు పోస్టింగ్‌ల కేటాయింపు ప్రక్రియ ముగిసింది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైన ప్రక్రియ బుధవారం తెల్లవారుజామున 3.30 గంటలకు ముగిసింది. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, లాంగ్వేజ్ పండిట్‌లకు పోస్టులు కేటాయించారు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో మొత్తం 124 పోస్టులకు గాను 116 మందిని ఎంపిక చేసి పోస్టింగ్ ఇచ్చారు. లాంగ్వేజ్ పండిట్ 23 పోస్టులకు 17 మందిని ఎంపిక చేశారు. ఇందులో 16 మందికి స్థానాలు కేటాయించారు. ఒకరు గైర్హాజరయ్యారు. పీ ఈటీ విభాగంలో తొమ్మిది మందికి ఎనిమిది మందిని ఎంపిక చేసి అందరికి పోస్టింగ్ ఇచ్చారు. ఎస్జీటీ విభాగంలో 403 పోస్టులకు 315 మందిని ఎంపిక చేశారు. ఇందులో 313 మందికి పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు.



పోస్టింగ్ ఆర్డర్లపై సంతకం చేస్తున్న డీఈవో దుర్గాప్రసాద్

క్లుప్తంగా

నిలకడగా ఎస్సారెస్పీ నీటి మట్టం

బాల్కొండ: ఎస్సారెస్పీ ఇన్‌ఫ్లో, ఔట్‌ ఫ్లో సమానంగా ఉండటంతో ప్రాజెక్ట్‌ నీటి మట్టం నిలకడగా ఉందని ప్రాజెక్ట్‌ ఏఈఈ రవి తెలిపారు. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 8509 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్‌ నుంచి కాకతీయ కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500, లక్ష్మి కాలువ ద్వారా 150, వరద కాలువ ద్వారా 2 వేలు, ఆవిరి రూపంలో 709, మిషన్‌ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్‌ నిండుకుండలా ఉంది.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు చర్యలు



సుభాష్‌నగర్‌: రాష్ట్రంలోని వివిధ వినియోగదారుల హక్కుల పరిరక్షణకు లీగల్‌ మెట్రాలజీ తరఫున అన్ని చర్యలు చేపడతామని లీగల్‌ మెట్రాలజీ ప్రధాన కార్యాలయ అసిస్టెంట్‌ కంట్రోలర్‌ ఎస్‌ రాజేశ్వర్‌ హామీ ఇచ్చారు. అంతర్జాతీయ ఆహార దినోత్సవం సందర్భంగా వినియోగదారుల రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రతినిధులు బుధవారం అసిస్టెంట్‌ కంట్రోలర్‌ను కలిసి వివిధ వినియోగదారుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వినియోగదారుల ప్రతినిధులు సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ.. వస్తు, సేవల నాణ్యతా ప్రమాణాలపై అక్టోబర్‌ 14 నుంచి నవంబర్‌ 16 వరకు తెలంగాణలోని 33 జిల్లాల్లో వినియోగదారుల చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అంతర్జాతీయ ఆహార దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు పల్లెపాడు దామోదర్‌, మొగిలిచర్ల సుదర్శన్‌, శంకర్‌ లాల్‌ చౌరాసియా, కాసు విశ్వేదర్‌ రాజు, శివపార్వతి, పెండోట అనిల్‌కుమార్‌, సందు ప్రవీణ్‌, గైని రత్నాకర్‌, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌లకు అవగాహన



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని గెలాక్సీ ఫంక్షన్‌ హాల్‌లో బుధవారం ఆటో డ్రైవర్‌లకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌ రావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. ప్రతి ఆటో డ్రైవర్‌ క్యూఆర్‌ కోడ్‌, రెండు సంవత్సరాల వ్యవధి కలిగిన బీమా కలిగి ఉండాలన్నారు. ప్రతి ఆటో డ్రైవర్‌ తమ వివరాలు, వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్‌లు సంబంధిత పోలీస్‌ స్టేషన్‌లో సమర్పించాలన్నారు. రూరల్‌ సీఐ రామన్‌ దేవునిపల్లి ఎస్సై రాజు, కామారెడ్డి రూరల్‌, రామారెడ్డి, మాచారెడ్డి మండలాలకు చెందిన దాదాపు 150 మంది ఆటో డ్రైవర్‌లు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి



నిజాంసాగర్‌(జుక్కల్‌): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం వడ్డించాలని బాన్సువాడ సబ్‌ కలెక్టర్‌ కొప్పిశెట్టి కిరణ్మయి సూచించారు. బుధవారం స్థానిక తహసీల్‌ కార్యాలయంతో పాటు నిజాంసాగర్‌ ప్రాజెక్టు, అచ్చంపేట గ్రామాన్ని, ఆదర్శ మోడల్‌ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అచ్చంపేటలో దళిత బంధు పథకం కింద తీసుకున్న యూనిట్లు, వాటి ద్వారా వస్తున్న ఆదాయం వివరాలను ఆమె తెలుసుకున్నారు. తహసీల్దార్‌ భిక్షపతి, ఎంఈవో తిరుపతిరెడ్డి, గిర్దావర్‌ అంజయ్య, నీటిపారుదల శాఖ ఏఈ శివప్రసాద్‌, మోడల్‌ పాఠశాల ప్రిన్సిపాల్‌ కార్తీక, సంధ్య తదితరులున్నారు.

మహిళా సంఘాల డబ్బులు స్వాహా

- సొంత అవసరాలకు వాడుకున్న వీఎల్‌ఈ నిర్వాహకురాలు
- రూ. 26 లక్షలు కాజేసిన వైనం
- గతంలో వీవోఏ రూ. 32 లక్షల వరకు టోకరా
- ఆందోళనలో మహిళా సంఘాల సభ్యులు
- పూర్తి స్థాయి ఏపీఎం లేక ఇబ్బందులు



మెండోరా ఐకేపీ కార్యాలయం

బాల్కొండ: మహిళా సంఘాల సభ్యుల పొదుపు డబ్బులతో పాటు రుణాల కిస్తులను సైతం స్వాహా చేసిన ఘటన మెండోరా మండల కేంద్రంలో కలకలం రేపింది. మండల కేంద్రంలో ఐకేపీ, ఎస్బీఐ సంయుక్తంగా నిర్వహిస్తున్న వీఎల్‌ఈ (విలేజ్‌ లెవల్‌ ఎంటర్‌ ప్రెన్యూర్‌) నిర్వాహకురాలు రూ. 26 లక్షలు కాజేసిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీఎల్‌ఈలో మహిళా సంఘ సభ్యులు ప్రతి నెలా తమ రుణాల డబ్బులను ఈ కేంద్రంలో చెల్లిస్తారు. కానీ సదరు కేంద్రం నిర్వాహకురాలు పూర్తిస్థాయిలో డబ్బులను బ్యాంకుకు జమచేయకుండా తన అవసరాలకు వాడుకునేది. దీంతో సదరు బ్యాంకు నుంచి రుణాలు ఇంకా పెండింగ్‌లో ఉన్నట్లు మహిళా సంఘాల సభ్యులకు సమాచారం అందడంతో వారు అవాక్కయ్యారు.

ఆన్‌లైన్‌ రావడం లేదంటూ..

మహిళా సంఘాల సభ్యులకు చదువు రాకపోవడంతో సదరు వీఎల్‌ఈ వారిని మోసం చేసేది. కంప్యూటర్‌లో ఆన్‌లైన్‌ రావడం లేదని తర్వాత వాటి బిల్లులు ఇస్తానని చెప్పి వారిని నమ్మించేది. నామమాత్రంగా ఓ కాగితంపై డబ్బులు తీసుకున్నట్లు రాసి ఇచ్చేది. ఇలా ప్రతి నెలా సాగేది. తీరా అసలు విషయం బయటపడడంతో బాధిత మహిళలు లబోదిబోమంటున్నారు. ఈ విషయమై ఫిర్యాదు అందిన సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే కేంద్రానికి చేరుకొని లెక్కలు చేస్తున్నారు. సుమారు రూ. 40 లక్షల వరకు టోకరా వేసినట్లు తెలుస్తోంది. కానీ అధికారులు మాత్రం రూ. 26 లక్షలు అని పేర్కొంటున్నారు.

గతంలో వీవోఏ..

మండలంలోని వెల్కటూర్‌ గ్రామానికి చెందిన వీవోఏ(విలేజ్‌ ఆర్గనైజేషన్‌ అసిస్టెంట్‌) రెండేళ్ల క్రితం రూ. 32 లక్షలకు టోకారా వేసింది. మహిళా సంఘాల సభ్యులు మూడు నెలల పాటు బ్యాంకుకు రుణాలు చెల్లించకుంటే డ్యూ లిస్టు వచ్చేది. ఇది గమనించిన వీవోఏ మధ్యలో నెల చెల్లిస్తూ మరో రెండు నెలల డబ్బులను తన అవసరాలకు వినియోగించుకునేది. ఇలా ఆమె బండారం బయట పడటంతో ఉన్నతాధికారులు ఆమెను సస్పెన్షన్‌ చేశారు. ఇందులో ఏపీఎంపై పలు ఆరోపణలు రావడంతో అధికారులు ఏపీఎంను బదిలీ చేశారు. దీంతో ఇక్కడ రెండేళ్లుగా ఏపీఎం పోస్టు ఖాళీగా ఉంది. వీవోఏ నుంచి ఇంకా రూ. 12 లక్షలు రికవరీ కావాల్సి ఉంది.

నెల రోజుల నుంచి ఇన్‌చార్జి ఏపీఎం..

ఐకేపీలో గత రెండేళ్లుగా సీనియర్‌ సీసీ అక్కడ ఏపీఎం ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపడుతున్నారు. కానీ గత నెల రోజుల నుంచి బాల్కొండ ఏపీఎం గంగాధర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇందులో సీనియర్‌ సీసీని ఎందుకు బాధ్యతల నుంచి తప్పించారో, బాల్కొండ ఏపీఎంకు ఎందుకు బాధ్యతలు ఇచ్చారో తెలియదు. ఐకేపీలో అంతా గందరగోళ పరిస్థితి నెలకొంటోంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయి ఏపీఎంను నియమించాలని మహిళా సమాఖ్య సభ్యులు డిమాండ్‌ చేస్తున్నారు.

లెక్క కొనసాగుతోంది

వీఎల్‌ఈ బ్యాంకు రుణాలను చెల్లించకుండా వినియోగించుకున్న మొత్తంపై లెక్క కొనసాగుతోంది. పూర్తి స్థాయి రికవరీ చేయాలని ఆదేశాలు ఇచ్చాం. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

– గంగాధర్‌, ఇన్‌చార్జి ఏపీఎం

సమయానికి రాని టీచర్లు

ప్రార్థన చేయించిన అటెండర్‌

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడంతో పాఠశాలలో పని చేస్తున్న అటెండరే విద్యార్థులతో ప్రార్థన చేయించాల్సిన దుస్థితి నెలకొంది. ఉదయం 9.15 నిమిషాలకు పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులు హాజరు కాకపోవడంతో అటెండరే ప్రార్థన చేయించారు. ప్రార్థన అనంతరం ఉపాధ్యాయులు రావడంతో గ్రామస్తులు ఉపాధ్యాయుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థులతో ప్రార్థన చేయిస్తున్న అటెండర్‌

క్రైం కార్నర్‌

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలో బుధవారం జరిగిన వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి చెందారు.



గులాం దస్తగిరి(ఫైల్‌)

బాన్సువాడ: బాన్సువాడ అటవీ శాఖ రేంజ్‌ పరిధిలోని నిజాంసాగర్‌ సెక్షన్‌ అధికారి గులాం దస్తగిరి (58) బుధవారం ఉదయం బాన్సువాడ ఆస్పత్రిలో గుండెపోటుతో మృతి చెందాడు. సిద్దిపేట్‌ జిల్లా ములుగుకు చెందిన గులాం దస్తగిరి నిజాంసాగర్‌ సెక్షన్‌ అధికారిగా రెండేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం విధులకు వెళ్లేందుకు దస్తగిరి సిద్ధమవుతుండగా ఒక్కసారిగా గుండెలో నొప్పి రావడంతో బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ దస్తగిరి మృతి చెందాడు.

చెరువులో పడి ఒకరు..

నిజామాబాద్‌ రూరల్‌: మండలంలోని మల్కాపూర్‌లో పెద్దోళ్ల లింగం(54) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు ఊరచెరువులో పడి మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లింగం బుధవారం కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువుకట్ట వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించి మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ విషయమై రూరల్‌ ఎస్‌హెచ్‌వో ఆరీఫ్‌ను వివరణ కోరగా తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు. మృతదేహాన్ని మార్చురీలో ఉంచినట్లు తెలిపారు.

అదృశ్యమైన వృద్ధురాలు ..



రాజవ్వ(ఫైల్‌)

నిజామాబాద్‌ రూరల్‌: మండలంలోని గూపన్‌పల్లికి చెందిన పానుగంటి పెద్దరాజవ్వ(85) ఈనెల 11న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. బుధవారం పులాంగ్‌వాగులో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కాగా మృతదేహం పెద్దరాజవ్వగా గుర్తించారు. ప్రమాదవశాత్తు వాగులో పడి మృతి చెందిందని ఎస్‌హెచ్‌వో ఆరిఫ్‌ పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి..



ఆర్మూర్‌టౌన్‌: మామిడిపల్లి శివారులోని రైల్వే గేటు వద్ద గూడ్స్‌ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి బుధవారం తెలిపారు. మృతుడి వయస్సు 30 ఏళ్ల వరకు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఆచూకీ తెలిసిన వారు 9440899341కు సమాచారం అందించాలని కోరారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

బాల్కొండ: మండలంలోని బస్సాపూర్‌ గ్రామానికి చెందిన కొండ్రు గణేశ్‌(25) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. బాల్కొండ ఏఎస్సై శంకర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గణేశ్‌ బతుకు దెరువు నిమిత్తం ఈ నెల 15న సౌదీ అరేబియా వెళ్లేందుకు హైదరాబాద్‌ శంషాబాద్‌ ఎయిర్‌పోర్టుకు వెళ్లాడు. ఆలస్యంగా వెళ్లడంతో విమానం వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన గణేశ్‌ ఇంటికి చేరుకొని పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్రంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. తండ్రి చిన్నయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

మోపాల్‌: మండలంలోని న్యాల్‌కల్‌ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ బుధవారం తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పేకాట స్థావరంపై దాడి చేశామని ఇందులో నలుగురిని అరెస్టు చేయగా వారి నుంచి రూ.6730 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

రేషన్‌ బియ్యం పట్టివేత

ధర్పల్లి: మండలంలోని వాడి గ్రామ శివారులో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్‌ బియ్యాన్ని సివిల్‌ సప్లై డీటీ రవి రాథోడ్‌ బుధవారం పట్టుకున్నారు. ఆటోలో 18 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు తెలిపారు. అనంతరం ఆటోను పీఎస్‌కు తరలించి ఇద్దరిపై ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై దుర్గాప్రసాద్‌ తెలిపారు.

దత్తాపూర్‌ వాసి అదృశ్యం



డొంకేశ్వర్‌/నిజామాబాద్‌నాగారం: డొంకేశ్వర్‌ మండలంలోని దత్తాపూర్‌ గ్రామానికి చెందిన సుంకరి భూమన్న అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భూమన్న ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఈ నెల 14న జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరుసటి రోజు బాత్‌రూంకి వెళ్తానని చెప్పి ఆస్పత్రి నుంచి అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో జిల్లా కేంద్రంలోని ఒకటో టౌన్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుమారుడు సుంకరి సంపత్‌ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.

జీజీహెచ్‌లో భైంసావాసి ..



విజయ

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వం ఆస్పత్రి నుంచి ఓ మహిళ అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్‌ జిల్లా భైంసా పట్టణానికి చెందిన ఊరెళ్ల విజయ అనే మహిళ సెప్టెంబర్‌ 29న చికిత్స కోసం నిజామాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చింది. కానీ తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

యూత్‌ కాంగ్రెస్‌ జాతీయాధ్యక్షుడిని కలిసిన విపుల్‌గౌడ్‌



జాతీయ అధ్యక్షుడితో విపుల్‌గౌడ్‌, పాల్గొన్న రాష్ట్ర, జిల్లా నాయకులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: ఢిల్లీలో యువజన కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 'నౌకరి దో – నషా నహీ' కార్యక్రమంలో.. జిల్లా యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్ష అభ్యర్థి విపుల్‌గౌడ్‌ ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన యువజన నాయకులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో కలిసి యువజన కాంగ్రెస్‌ జాతీయ అధ్యక్షుడు ఉదయ్‌భానును కలిశారు. దేశంలో డ్రగ్స్‌ దందా పెరుగుతున్న నేపథ్యంలో యువతకు ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో అన్ని రాష్ట్రాల యువజన కాంగ్రెస్‌ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విపుల్‌గౌడ్‌తో పాటు యువజన కాంగ్రెస్‌ జాతీయ సమన్వయకర్త నరాల నిహార్‌, రాష్ట్ర యువజన కాంగ్రెస్‌ అధ్యక్ష అభ్యర్థులు శివచరణ్‌, మిట్టపల్లి వెంకటేశ్‌, అంక్షారెడ్డి ఉన్నారు.

గాడిద పాలకు భలే డిమాండ్‌

- దగ్గు, దమ్ము, ఆస్తమాకు ఎంతో మేలంటున్న నిర్వాహకులు
- చిన్న గ్లాసు పాల ధర రూ. 50 నుంచి రూ. 100



బాల్కొండ: ప్రస్తుతం సమాజంలో గాడిద పాలకు మంచి డిమాండ్‌ ఉంది. గాడిద పాలు తాగిస్తే ఆరోగ్యానికి మేలు చేస్తుందని ప్రచారం చేస్తూ పాలను విక్రయిస్తున్నారు. గాడిద పాలు కూడా తాగే వారి సంఖ్య పెరగడంతో ఈ పాలకు మార్కెట్‌లో డిమాండ్‌ పెరిగింది. కరము పాలు గరిటడైనా చాలు అన్నట్లుగా.. గాడిద పాలు తాగితే పలు రకాల మొండి వ్యాధులకు ఉపశమనం కలుగుతుందని గాడిద పాల విక్రయదారులు పేర్కొంటున్నారు. ఇందులో నిజమెంతో తెలీదు కానీ, గాడిద పాలను కూడా అనేక మంది కొనుగోలు చేసి తాగుతున్నారు. మండల కేంద్రంలో కొందరు వీటిని గాడిద పాలను విక్రయిస్తున్నారు. పాలు కావాలంటే ఇంటి వద్దనే గాడిద పాలను పితికి అక్కడికక్కడే ఇస్తారు. చిన్న గ్లాస్‌ పాలకు రూ. 50 నుంచి రూ. 100 చొప్పున విక్రయిస్తున్నారు. గిరాకీ ఉంటే అంతో ఇంతో ఆదాయం వస్తోందని, అది కూడా గాడిద పాల గురించి తెలిసిన వారు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, టెక్నాలజీ పెరిగిన ఈ రోజుల్లో రకరకాల ఆహార పదార్థాలు వచ్చాయని దీంతో గాడిద పాలకు కాస్త గిరాకీ తగ్గిందని విక్రయదారులు పేర్కొంటున్నారు. దగ్గు, దమ్ము, ఆస్తమా, గురక వంటి వ్యాధులకు గాడిద పాలు తాగితే పూర్తిగా తగ్గిపోతుందని, ఈ పాలల్లో పలు ఔషధ గుణాలు ఉంటాయని నిర్వాహకులు ప్రచారం చేస్తూ గాడిద పాలను విక్రయిస్తున్నారు.

కల్తీ కల్లు తయారు చేస్తున్న ఇద్దరి అరెస్టు



నిందితుల అరెస్టును చూపుతున్న డీఎస్పీ

లింగంపేట: కల్తీ కల్లు తయారు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. సురాయిపల్లి గ్రామానికి చెందిన రమేశ్‌గౌడ్‌ నిషేధిత ఆల్ప్రాజోలంతో పాటు పలు రసాయనాలతో కల్తీ కల్లు తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో దుకాణంపై దాడి నిర్వహించినట్లు పేర్కొన్నారు. సోదాల్లో కల్లు దుకాణం నుంచి రెండు కల్లు సీసాలు, 30 గ్రాముల ఆల్ప్రాజోలం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రమేశ్‌గౌడ్‌ను విచారించగా నాగిరెడ్డిపేట మండలం రామక్కపల్లికి చెందిన కలాలి సత్యనారాయణగౌడ్‌ వద్ద ఆల్ప్రాజోలం తీసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఇరువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. దాడిలో లింగంపేట ఎస్సై అరుణ్‌కుమార్‌, కానిస్టేబుల్‌ రాజేందర్‌, భైరవప్రసాద్‌, రమేశ్‌, రామస్వామి, సంపత్‌కుమార్‌ పాల్గొన్నారు. అనంతరం వీరిని డీఎస్పీ అభినందించారు.

అదుపు తప్పి కల్వర్టులో కారు బోల్తా

- త్రుటిలో తప్పిన ప్రాణాపాయం



కల్వర్టులో బోల్తాపడిన కారు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి పీఎస్‌ పరిధిలోని బీబీపూర్‌ సమీపంలో 44వ నంబర్‌ జాతీయ రహదారిపై వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న కల్వర్టులో బోల్తా పడింది. డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్‌, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ మండలం యాచారం తండాకు చెందిన బి బాల్‌సింగ్‌ ఏఆర్‌ హెడ్‌కానిస్టేబుల్‌గా నిజామాబాద్‌ జిల్లా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం ఇందల్వాయి మండలం పాటితండాలోని చెల్లెలు వద్దకు వెళ్లి సాయంత్రం తిరిగి నిజామాబాద్‌కు కారులో బయలుదేరాడు. బీబీపూర్‌ వద్దకు రాగానే కారు ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న సూచిక బోర్డులను ఢీకొని పక్కనే ఉన్న కల్వర్టులో బోల్తాపడింది. గమనించిన స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని కారులో నుంచి బాల్‌సింగ్‌ను బయటకు తీశారు. ప్రమాదంలో బాల్‌సింగ్‌కు త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. గాయపడ్డ బాల్‌సింగ్‌ను హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలించారు. సమాచారం అందుకున్న డిచ్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్రేన్‌ సాయంతో కారును బయటకు తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భిక్కనూర్‌లో ఆటో ..



ధ్వంసమైన ఆటో

ఎల్లారెడ్డిరూరల్‌: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని ఢీకొన్న ఆటో బోల్తా పడిన ఘటన ఎల్లారెడ్డి మండలంలోని భిక్కనూర్‌ గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపేట మండలంలోని ఎక్కపల్లి నుంచి ఎల్లారెడ్డి వైపునకు వెళ్తున్న ఆటో గ్రామ శివారులో నడుచుకుంటు వెళ్తున్న వ్యక్తి ఢీకొని బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న చాకలి కిష్టయ్య, సుధాకర్‌, సంతోష్‌, మోతి, ప్రకాశ్‌తో పాటు మరి కొందరికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన చాకలి కిష్టయ్య, ఆటో డ్రైవర్‌ ప్రకాశ్‌ను కామారెడ్డికి రిఫర్‌ చేసినట్లు వైద్యులు తెలిపారు. క్షతగాత్రులను కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు సాయిబాబా పరామర్శించారు.

చందూర్‌లో వడ్ల లారీ ..



వర్ని: చందూర్‌ శివారులో బుధవారం వడ్ల లోడుతో వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. వర్ని మండలంలోని రాజీపేట గ్రామంలో రైతుల వద్ద ధాన్యం సేకరించి లారీలో తీసుకెళ్తుండగా చందూర్‌ శివారులో బోల్తా పడింది. ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. వడ్లు నీటిలో పడి తడిసిపోయాయి. స్థానికులు, రైతులు బోల్తా పడిన లారీని యంత్రాలసాయం పైకి తీయించారు.

మానేరులో దూకి ఆత్మహత్య



ప్రకాశ్‌(ఫైల్‌)

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఇసాయిపేట గ్రామానికి చెందిన గుడ్లపల్లి ప్రకాశ్‌(55) రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం మానేరు డ్యాంలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ప్రకాశ్‌ కుమార్తె పెళ్లికి చేసిన అప్పుతో పాటు భార్య నాగలక్ష్మి అనారోగ్యానికి గురి కాగా ఆస్పత్రి ఖర్చుల కోసం మరింత అప్పు చేశాడు. ప్రకాశ్‌ మంగళవారం కూలి పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. బుధవారం మానేరులో మృతదేహం కనిపించడంతో స్థానికులు కుటుంబీకులు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించారు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

అప్పుల బాధతో మరొకరు..



స్వామి(ఫైల్‌)

భిక్కనూరు: అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పాతినిపల్లి స్వామి(36) హైదరాబాద్‌లోని ప్రైవేట్‌ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. దసరా పండుగకు స్వగ్రామమైన తిప్పాపూర్‌కు వచ్చాడు. కొంత కాలంగా వంశపార పర్యంగా వస్తున్న వ్యవసాయభూమి తన పేరిట మార్పిడికి యత్నిస్తున్నా జరగలేదు. దీనికి తోడు చేసిన అప్పులు పెరగడంతో జీవితంపై విరక్తి చెంది గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. స్వామిది పేద కుటుంబం కావడంతో కాంగ్రెస్‌ నాయకులు బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు.

డ్రంకన్‌ డ్రైవ్‌లో ఒకరికి మూడు రోజుల జైలు

ఖలీల్‌వాడి: డ్రంకన్‌ డ్రైవ్‌లో ఒకరికి మూడు రోజుల జైలు శిక్షను మెజిస్ట్రేట్‌ విధించినట్లు ట్రాఫిక్‌ ఏసీపీ నారాయణ తెలిపారు. బుధవారం నగరంలోని ట్రాఫిక్‌ పీఎస్‌లో డ్రంకన్‌ డ్రైవ్‌లో దొరికిన వారికి ట్రాఫిక్‌ సీఐ వీరయ్య కౌన్సెలింగ్‌ నిర్వహించారు. అనంతరం వీరిని కోర్టులో హాజరుపర్చగా జిల్లా సెకండ్‌క్లాస్‌ మెజిస్ట్రేట్‌ అహ్మద్‌ మొహియుద్దీన్‌ ముగ్గురికి రూ.7 వేల జరిమానా, ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

డీజే నిర్వాహకుడికి ఒక రోజు..

ఖలీల్‌వాడి: లైసెన్స్‌ లేకుండా డీజే నిర్వహిస్తున్న వ్యక్తికి మెజిస్ట్రేట్‌ ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి బుధవారం తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. మోపాల్‌ మండలం కులాస్‌పూర్‌కు చెందిన నిమ్మల వంశీ లైసెన్స్‌ లేకుండా డీజే సౌండ్‌ సిస్టం నిర్వహిస్తున్నాడు. తన డీజే సౌండ్‌ సిస్టంను కిరాయికి ఇవ్వడంతో ఫిర్యాదు నమోదైంది. దీంతో నిర్వాహకుడు అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి



భిక్కనూరు: మండల కేంద్రంలో విద్యుదాఘాతంతో పాడి గేదె బుధవారం మృతి చెందింది. మండల కేంద్రానికి చెందిన మహ్మద్‌ ఖాదీర్‌కు చెందిన గేదె గడ్డి మేస్తుండగా అకస్మాత్తుగా విద్యుత్‌ తీగ తెగిపడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ విషయమై సమాచారం అందుకున్న పశువైద్యాధికారి దేవేందర్‌ ఘటన స్థలానికి వచ్చి పంచనామా నిర్వహించారు.

దుకాణం యాజమానిపై దాడి

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఓ దుకాణంపై దాడి చేసిన ఐదుగురు గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌ రెడ్డి బుధవారం తెలిపారు. గాంధారి మండలం జువ్వాడి గ్రామానికి చెందిన బాలేందర్‌ పట్టణంలోని ప్రియ థియేటర్‌ కాంప్లెక్స్‌లో శివం ఎలక్ట్రికల్స్‌ దుకాణాన్ని నడుపుతున్నాడు. మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో దుకాణం ఎదురుగా ఒక కారు వచ్చి ఆగింది. అందులో ఐదుగురు వ్యక్తులు ఉన్నారు. అప్పటికే వారి మధ్య ఏదో గొడవ జరుగుతోంది. వారు గొడవ పడుతుండగా దుకాణం యజమానులు బాలేందర్‌, శివరాజులు నవ్వారని కారులోని వ్యక్తులు భావించారు. సదరు వ్యక్తులు షాపులోకి వచ్చి వీరంగం సృష్టించారు. దుకాణం యజమానులతో పాటు దుకాణంపై దాడి చేసి సామాగ్రిని ధ్వంసం చేశారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోయారు. బాలేందర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.